
# వరండా

టి.యస్.ఎ. కృష్ణమూర్తి



వర్షం ఎక్కువవుతోండగా లైబ్రరీ నుండి వెలుపలికి వచ్చాను. వర్షానికి భయపడి నేను ఎప్పుడూ ఎక్కడా ఆగిపోయింది లేదు. అందుకే తడుస్తూనే బయల్దేరాను ఇంటికి. ఇల్లు చేరేసరికి తడచి ముద్దయిపోయాను. వరండా ప్రక్కనున్న సందులోకి వెళ్ళబోతున్న నన్ను చూసి బిగ్గరగా దగ్గుతున్న బాబాయ్ దగ్గును ఆపుకుంటూ అరిచాడు.

"ఎందుకురా అబ్బీ అలా తడిచావు ? ఎక్కడ చూసినా విషజ్వరాలున్నాయంటున్నారు ఊర్లో !"

జవాబుగా చిన్నగా నవ్వి సందులోకి వెళ్ళకుండా వరండా పైకెక్కి వెళ్ళి బాబాయ్ మంచం దగ్గరగా నిలబడ్డాను.

అనేక సంవత్సరాలుగా చల్లనీళ్ళ స్నానానికి అలవాటుపడిన వాడ్నవడం వల్లా, అనేక ప్రాంతాలలో, అనేక రకాల వాతావరణాలలో కాలంగడిపి వచ్చిన వాడ్నవడం వలనా ఎంత వర్షంలో తడిచినా నాకు కనీసం జలుబు కూడా చేయదు. అయితే ఈ పెద్దవాళ్ళకు పిల్లలు ఎంత పెద్దవాళ్ళయినా ఇంకా చిన్న పిల్లలుగానే కన్పిస్తారేమో! ప్రతిదానికీ కంగారు పడిపోతుంటారు.

"ఎలా ఉంది బాబాయ్ ? ఒంట్లో !" అని ప్రేమగా అడిగాను.

ఉమ్మడి కుటుంబాలలో వయసు వుడిగిపోయిన ముసలి వాళ్ళను గూర్చి ప్రత్యేక శ్రద్ధ కన్పించేవారు తక్కువ సహజంగా. నా ప్రశ్నకు బాబాయ్ కళ్ళలో తడి కన్పించింది కొద్దిగా.

"ఏముందిరా అబ్బీ... పోయేకాలమే కానీ.. వచ్చే కాలం కాదు కదా ? మొన్నటికి డెబ్బయి రెండేళ్ళు పూర్తయాయి నాకు. ఇంకెన్నాళ్ళుండబోతాను ? మహా అయితే ఇంకో రెండుమూడు నెలలు... అంతే !" అన్నాడు.

ముసలాయన చెప్పింది నిజమే. ఆయన చాల రోజులుగా జబ్బుపడి ఉన్నాడు. ప్రస్తుతం మంచం దిగలేని స్థితిలోకి వచ్చేసింది ఆయన పరిస్థితి.

బాబాయ్‌తో మాట్లాడి వరండా దిగి వచ్చేస్తోంటే ఆయన అన్నాడు :

"ఒరేయి అబ్బీ...ఈ వరండాలో ఓ దేముడి పటం తగిలించరా. చనిపోయేముందు దేవుడ్ని చూస్తూ కన్నుమూస్తాను."

నా మనసు అదోలా అయిపోయింది. తల ఊపి సందులోకి వచ్చేశాను.

సందు చివర్నవున్న నా గదిలోకి నేను చేరుకునేసరికి నా గదిలో మూతపెట్టబడ్డ పాత్రలో చపాతీలు, ప్లాస్కులో పాలు బల్లమీద సిద్ధంగా ఉన్నాయి.

నేను రాత్రులందు భోజనం మానేసి రెండేండ్లు అయింది. నా గది తాలంచెవి మరోటి ఇంట్లో వాళ్ళవద్ద ఉంటుంది. అందువల్ల నేనున్నా లేకపోయినా పిల్లలు సరిగ్గా రాత్రి ఏడు గంటలకు నా రాత్రి ఆహారంగా చపాతీలు, పాలు నా టేబిలుమీద ఉంచేస్తారు.

తల తుడుచుకుని దుస్తులు మార్చుకుని కుర్చీలో కూర్చుని చల్లారిపోతున్న చపాతీలు తింటూ నా గదిలో ఉన్న ఒకే ఒక దేముడి ఫొటోకేసి చూశాను.

* * *

సకల దేవతలూ పరివేష్టించి కొలుస్తోండగా, లక్ష్మీదేవి పాదములు ఒత్తుతోండగా సర్వాలంకారభూషితుడై ఆదిశేషుడిమీద పవళించి వున్న శంఖు, చక్రధారి ఫోటోను ఉదయం పది గంటలప్పుడు తీసుకువెళ్ళి వరండాలో బాబాయ్

మంచం ప్రక్కనున్న గోడమీద మూడు మేకుల సహాయంతో బాబాయ్ పడుకున్నా కూడా పటం స్పష్టంగా కనిపించేలా వాల్చి తగిలించాను.

బాబాయ్ కళ్ళు మెరిశాయి. ప్రశంసా పూర్వకంగా నాకేసి చూశాడు.

''బాబాయ్ ! హాయిగా నా గదిలోకి వచ్చేయ రాదూ ? చలిగాలిలో ఈ వరండాలోనే ఉండి అవస్థపడకపోతే ? !'' అన్నాను.

ఆయన బిగ్గరగా నవ్వాడు.

''ఒరేయి అబ్బీ... అసలు ఈ వరండాలు ఉడిగి బుడిగిలోకి వచ్చే ముసలివాళ్ళ కోసమే సృష్టింపబడ్డాయిరా నాన్నా !'' అన్నాడు.

''ఫో బాబాయ్ ! నీది మరీ చాదస్తం !'' అన్నాను తెల్లబోయి.

''చాదస్తం కాదురా నాన్నా... యధార్థం. మానవ జీవితంలో అతి భయంకరమైనది మనిషి చమరదశ. ఈ దశలో మనిషి ముసలితనంతోటీ, జబ్బులతోటీ పీడింపబడుతూ అసహ్యంగా తయారవుతాడు. ఆ అసహ్యాన్ని తక్కినవాళ్ళు భరించడం కష్టం. తక్కినవాళ్ళు భరించగలిగినా తను తక్కినవాళ్ళ మధ్య ఉండలేడు చమర దశలోని మనిషి. ఈ దశలోని మనిషి కోటీశ్వరుడు కావచ్చు, బిచ్చగాడు కావచ్చు... నిరాశా నిస్పృహలకూ, వంటరితనానికీ లోనుగాకుండా తప్పించుకోలేడు.

అందుకే తక్కినవాళ్ళు తమకు తెలియ కుండానే కాస్త దూరంగా ఉంచాలని ప్రయత్ని స్తారు... తనూ వారికి కాస్త ఎడంగా ప్రత్యేకంగా వంటరిగా ఉండాలని అనుకుంటాడు. అలా వారు ఉంచడానికీ, ముసలివాళ్ళు ఉండడానికీ చక్కగా పనికివచ్చే ప్రదేశం... ముఖ్యంగా మధ్యతరగతి ఇళ్ళలో... ఏదో తెలుసా ? వరండా !''

గబగబా చెప్పడంవల్ల కొద్దిగా దగ్గి ఆయాసపడ్తూ నవ్వుతున్నాడు బాబాయ్. జీవితాన్ని కాచి వడబోసిన విజ్ఞానం ఆయన మనసు నిండుగా ఉంది. ఆయన చెప్పే ప్రతి మాటలోనూ వంద శాతం నిజమూ ఉంది.

''ఈ వరండాలోనే మా తాతవాళ్ళ అమ్మా నాన్నలు... అంటే మా ముత్తాత, ముత్తవ్వలు తమ చివరి రోజులు గడిపారని విన్నాను. మా తాతగారు ఆరడుగుల ఆజానుబాహుడు. తన చివరి దశలో దాదాపు ఆరునెలలు ఇదే వరండాలో ఇదే మంచంమీద జబ్బుతో తీసుకుని, తీసుకుని చనిపోవడం నేను చూశాను. ఆయన పోయాక ఆర్నెల్లకంతా మా బామ్మ ఈ మంచం మీదకు చేరి కొద్దిరోజులలోనే కన్నుమూయడం నాకు బాగా జ్ఞాపకం వుంది. అసలు ఆ రోజుల లోనే వీధిన వెళ్ళేవారికి ఈ మంచంమీది మనుషులు కనపడకుండా ఉండడాన్కి వరండా సగానికి ఈ ఒంటి ఇటుక గోడ కట్టించారు.

ఈ మంచంమీద ఈ వరండాలో మనవాళ్ళు ఎందరో కడపటిరోజులు అనుభవించారు. నీవు చూసింది చాల కొద్దిమందినే ! ఇప్పటికి ఆఖర్న కన్నుమూసినవాడు మీ నాన్న. పదేళ్ళు దాటింది కదా ? వాడికన్నా నేను రెండేండ్లే చిన్నవాడ్ని... ఇప్పటికి ఈ ఇంట్లో అందరికన్నా పెద్దవాడ్ని... ఇంకా కొన్నిరోజులలో...'' అంటూ అర్థోక్తిలో ఆపేసి నవ్వుతున్నాడు బాబాయ్.

నా ఒళ్ళు జలదరించింది. వయసు ఉడిగిన వాళ్ళు చాలామంది తమ మరణాన్ని గూర్చి చాలా తేలికగా తీసుకుంటారు. మా బాబాయి మరీనూ. ఆయనకు చావంటే ఏదో పకోడీలు కొరుక్కు తిన్నట్లుగా ఉన్నట్లుంది.

* * *

పదిరోజులు గడిచాయి.

బాబాయ్ ఆరోగ్యం మరీ దిగజారిపోయింది. ఆహారం తీసుకోవడం బొత్తిగా మానేశాడు. కాలకృత్యాలు అన్నీ మంచంమీదే జరిపించాల్సి వస్తోంది.

''ముసలాయన టపా కట్టేసేలావున్నాడు!'' అనుకుంటున్నారు ఇంట్లో వాళ్ళందరూ. మునుపటికన్నా మరికాస్త శ్రద్ధగా ఆయనకేసి చూస్తున్నారు అందరూ. అందరికన్నా ఎక్కువ బాధపడ్డవాడూ ఆయన సేవా శుశ్రూషలలో ఎక్కువభాగం పంచుకున్నవాడూ వాసు. వాడు బాబాయ్ పెద్దకొడుకుకి రెండవ పుత్రుడు.

ఒకరోజు ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో నా గదికి వచ్చాడు వాడు.

''బాబాయ్ ! మీరు నాకు కాస్త తోడు రావాలి !'' అన్నాడు వచ్చీ రావడంతోటే.

''ఎక్కడికిరా ? ఎందుకూ ?''


''వరండాలోకి. తాతయ్య కాలకృత్యాలు కూడా మంచంమీదే చేసుకుంటున్నాడా ? ఆయన బట్టలు మార్చడానికీ, ఆయనకు ఒళ్ళు తుడవ డానికీ అమ్మా, అత్తయ్యా వాళ్ళందరూ అయిష్టత చూపుతున్నారు. అసలు ఆయనకు సరయిన సౌకర్యాలు సక్రమంగా అమరడంలేదు ప్రక్కమీద. మీరుగానీ ఉదయం ఒక అరగంట, సాయంకాలము అరగంట నాతో సహకరిస్తే ఆయనకు మనం చేయగలిగిన సేవలు చేయవచ్చు శుభ్రంగా!'' అన్నాడు.

వాడ్ని చూస్తూంటే ముచ్చటేసింది నాకు. బి. ఎ. మొదటి సంవత్సరం చదువుతున్న చాకు లాంటి కుర్రాడువాడు. వాడిలోని దయాహృద యానికి వాడివైపు ప్రశంశాపూర్వకంగా చూడ కుండా ఉండలేకపోయాను.

వాడి వెంబడి వరండాకేసి నడిచాను.

వాడు మొదట ఇంట్లోకి వెళ్ళి ఓ పాత చాప తీసుకువచ్చాడు. దాన్ని క్రిందపరచి నా సహాయంతో బాబాయ్‌ని మంచంమీదనుండీ చాప మీదకు దించి పడుకోబెట్టాడు. తరువాత చకచకా మంచం మీదవున్న పడకమీది దుప్పట్లూ, దిండు ముసుగూ అన్నీ తీసి కట్టకట్టి పనిమనిషి చేతికి ఇచ్చి వెళ్ళి- దగ్గరలోఉన్న పిల్లకాలువలో ఉతుక్కురమ్మని పురమాయించాడు. ఇంట్లోంచీ వేరే దుప్పట్లు, దిండు గలీబు, ఓ రబ్బరు షీటు తెచ్చి మంచంమీద ప్రక్క నీటుగా తయారు చేశాడు. ఇంట్లోంచీ ఓ చిన్న గ్లాసులో ఉప్పు నీళ్ళు తెచ్చి బాబాయ్ నోరును శుభ్రపరిచాడు. మళ్ళీ ఇంట్లోకి వెళ్ళి ఓ పెద్ద బేసిన్‌లో వేడి నీళ్ళు తెచ్చి ఆ నీటిలో నాలుగు చుక్కలు డెట్టాల్ వేసి ఓ టవలుతో ఆ నీళ్ళు అద్దుకుంటూ ముసలాయన ఒళ్ళంతా శుభ్రంగా తుడిచి, ఆయనకు శుభ్రంగా ఉతికిన లుంగీ కట్టబెట్టాడు. తరువాత నా సహాయంతో బాబాయ్‌ని జాగ్రత్తగా మంచంమీదకు చేర్చాడు.

నిజానికి నేను చేసింది చాల స్వల్పం. వాడు పట్టుకోమన్నట్లు బాబాయిని పట్టుకోవడం.



వాడు క్వాలిఫైడ్ మేల్ నర్సులా చకచకా పనంతా చేశాడు.

ప్రతిరోజూ ఉదయమూ, సాయంకాలమూ రెండు పర్యాయాలు వాడూ, నేనూ కలిసి ముసలాయననూ, ఆయన పక్కనూ శుభ్రపరిచే కార్యక్రమమును కొనసాగించసాగాము. ఇంట్లో వాళ్ళందరూ మా పనిని చూసి చాల సంతోష పడ్డారు. వాళ్ళ సంతోషానికి రెండు కారణాలు కన్పించాయి నాకు. ఒకటి... వాళ్ళకు శ్రమ తగ్గడం. రెండు... ముసలాయనకు ఎవరో ఒకరు సేవలు చేస్తున్నారనే సంతృప్తి కలగడం.

వాసూని చూసి కాస్త బుద్ధి తెచ్చుకున్న తక్కిన పిల్లలు గంట గంటకూ బాబాయ్‌ని శ్రద్ధగా విచారించి ఆయనచేత ఏదో ఒకటి త్రాగిస్తున్నారు అక్కరగా.

మా ఫామిలీ డాక్టరు రవిచంద్ర ప్రతిరోజూ వచ్చి ముసలాయనని చూసి వెల్తున్నాడు. ఏవో మందులు, ఇంజక్షనులు ఇస్తూనే వున్నాడు.

నా అసిస్టెన్సు తీసుకుని వాసూగాడు ఎంతో జాగ్రత్తగా ముసలాయన్ని చాలా పరిశుభ్రంగా ఉంచుతున్నాడు. అయినాకూడా బాబాయి దురదృష్టం ఏమిటోగాని ఆయనకు బెడ్ సోర్సు ప్రారంభం అయ్యాయి.

మొదట వీపులో వచ్చాయి పుండ్లు. డాక్టరు ఇచ్చిన పౌడర్ అద్ది, గాజాగుడ్డతో పుండ్లకు డ్రెస్సింగ్‌చేసి ప్రక్కకు తిప్పి పడుకోబెట్టాడు వాసు ఆయనను. మరునాఢు ఉదయానికి ప్రక్కలోకూడా వచ్చాయి పుండ్లు.

ఒళ్లంతా రెండుసార్లు బాగా తుడిచి పుండ్లకు డ్రెస్సింగ్ చేసి ఇటువైపు త్రిప్పి పడుకోబెట్టాడు వాసు ఆయనను. మరునాటికి ఈవైపు కూడా వచ్చేశాయి పుండ్లు.

ఏమిటి చెయ్యడం ? అని నావైపు ప్రశ్నార్థకంగా చూశాడు వాడు. నేనేంచెప్ప గలను ? జబ్బుపడ్డ మనిషికి ఎలా సేవ చెయ్యాలో వాణ్ణిచూసి నేర్చుకుంటున్న మనిషిని నేను. తక్కినవాళ్లు నాకన్నా అన్యాయం. కావాలంటే ఏడుస్తారు, బాధపడ్తారు తప్ప అంతకుమించి ఏమీచేయలేరు.

"బాబాయ్! తాతయ్యను బోర్లగిలా పడుకోబెట్టడానికి వీలులేదు. ఎందుకంటే ఊపిరి ఇప్పుడే సరిగ్గా ఆడడంలేదు ఆయనకి. బోర్లగిలా పడుకోబెడ్తే అసలు ఆడదు ఊపిరి. కాబట్టి ... వీపులో పుండ్లు కాస్త ఆరిపోయా యిగా... బాగా డ్రెస్సింగ్‌చేసి వెల్లకిలానే పడుకో బెడ్తాము..."

నేను తల ఊపాను. అరగంటలో ఆయన ఒళ్ళంతా శుభ్రపరచి పుండ్లకు బాగా మందువేసి డ్రెస్సింగ్ చేసి వెల్లకిలా పడుకోబెట్టాము.

ఆ కార్యక్రమం అయ్యాక ఇద్దరూ వెళ్లి డాక్టరు రవిచంద్రను హాస్పటల్‌లో కలిసి పరిస్థితి చెప్పాము వివరంగా.



## వరండా

"ఏం జరిగినా ఇంకో నాలుగైదు రోజులు ...అంతే! కావాలంటే మీ తృప్తికి హాస్పటల్‌లో అడ్మిట్ చేసుకుని సెలైన్ ఇస్తాను. ఏమిచ్చినా లైఫ్ ఇవ్వలేను!" అని చెప్పేశాడు డాక్టరు.

"దేవుడిపై భారం వేసి హాస్పటల్‌లో చేర్పిస్తాము" అన్నాడు వాసూ వాళ్ల నాన్న. కానీ ముసలాయన హాస్పటల్‌లో చేరడానికి ససేమిరా ఒప్పుకోలేదు.

"ఒరేయి అబ్బాయిలూ పోయేప్రాణాన్ని సెలైన్‌బాటల్లు ఆపలేవురా...ఆపగలిగినా ఒకటి రెండు రోజులు మాత్రమేగా ? హాస్పటల్‌లో ఇంతకన్నా సౌకర్యాలు నాకు లభించవు. నన్ను ఇక్కడ ఇలాగే ప్రశాంతంగా ఉండనివ్వండి. ఇక్కడే కన్నుమూస్తాను. ఇదే నా ఆఖరి కోరిక!" అనేశాడు ఆయన.

### నా చితాగ్ని వెలిగిన చోటు

శిరసెత్తిన పశుతత్వం
చీలిపోయే చోటు
సౌందర్య పశంగ బింబాలు
శతథాడుల్లిపోయే చోటు
ఈర్ష్య వాహినులు
ఇంకిపోయే చోటు
అసమానతల హద్దులు
అణగారే చోటు
పాంచభౌతిక కళేబరం
పంచవిధాల విశ్లేషితమయ్యే చోటు
మానవతా మందార పుష్పం
పరిమళాలు ప్రసరించే చోటు
శాశ్వత శాంతి పవనాలు
సంగమించే చోటు
అదే అదే నా చితాగ్ని వెలిగిన చోటు.

— మునుమూరు రఘువర్మ

కొద్దిగా పాలు, లేదా పండ్లరసం తప్ప ఆయన కడుపులోకి ఘనపదార్థం ఏదీ వెళ్లలేదు అప్పటికి ఇరవై రోజులుగా.

* * *

"బ్రతికిన బ్రతుకు చచ్చే చావులో తెలుస్తుంది!" అనేది ఒక పాత సామెత. ఇహలోకయాత్ర ముగించేప్పుడు పుణ్యాత్ములైతే సుఖంగానే వుండి సుఖంగానే కన్నుమూస్తారనే దీని భావము. కానీఈ సామెతలో అట్టే నిజం లేదనిపించింది నాకు. ఎందుకంటే నాకు తెలిసి నంతవరకూ మాబాబాయ్‌లాంటి అతిమంచివాళ్ళు ఈ లోకంలో చాల తక్కువ. అలాంటి మంచి మనిషి చనిపోయేప్పుడు చాల బాధ అనుభవించాడు.

చాల ఘనంగా బ్రతికిన వ్యక్తి ఆయన. ఆయన చాల దయాహృదయుడు కూడా!

ఓ సంఘటన నాకు ఇప్పటికీ కళ్ళకు కట్టినట్లు జ్ఞాపకం ఉంది. నేను చిన్నవాడుగా వున్నప్పుడు ఓసారి బాబాయ్ ఏదో పనిమీద ఓ పల్లెటూరు వెళ్తూవుంటే నేనూ వెళ్ళాలని మారాంచేసి ఆయనను ఒప్పించి ఆయన వెంబడి వెళ్లాను. ఆ పల్లెకు బస్ సౌకర్యములేదు. పని ముగించుకుని కాలినడకన కాలిదారిన తిరిగి వస్తూ వున్నప్పుడు దారిలో ఇంకో చిన్న పల్లెటూరు వద్ద క్రిందపడి కొట్టుకుంటున్న ఓ మూర్ఛరోగిష్టి బిచ్చగాడు కన్పించాడు మాకు. కొందరు బిందెలతో నీళ్ళు తెచ్చి అతని నెత్తినా, ఒళ్ళంతా కుమ్మరిస్తున్నారు.

అతనికి తెలివి వచ్చాక ... అసలే చలి కాలమేమో, అతడు గడగడా వణుకుతూ ఉంటే మా బాబాయ్ తను తొడుక్కున్న చొక్కా, కప్పుకున్న వస్త్రమూ రెండూ తీసి అతనికి ఇచ్చేసి గోసి పంచెతోటే బయల్దేరి వచ్చేశాడు. అంతటి ఉదారుడూ, మంచిమనసు కలిగినవాడూ అయిన బాబాయ్ చివరిరోజులు చాల ఘోరంగా గడిచాయి ... "లలాట లిఖితే పునః ప్రయాతి" అన్న సూక్తి నిజం అన్పిస్తూ.

పడకపుండ్లు ఉధృతం అయిపోయి ఆయన శరీరం వాసన పట్టిపోయింది. వాసుగాడూ, నేనూ ముక్కులకు అడ్డుగా తుండుగుడ్డలు కట్టుకుని ఆయన ఒళ్ళు తుడచి మందులు పూయసాగాము. ఆయన శరీరానికి చీమలు పట్టకుండా మంచం చుట్టూ గెమాక్సిన్ పౌడర్ వేసి, వాసన ఎక్కువగా రాకుండా ఫెనాయిల్, డెట్టాయిల్ నీళ్లలో కలిపి చల్లేవాడు వాసు.

"నాలుగైదు రోజులే" అన్న డాక్టరు రవిచంద్ర అంచనా తప్పయింది. ఏ కాస్త కదిలించాలన్నా నరకయాతనకు గురవుతూ దాదాపు పదిహేనురోజులు బాధపడ్డాడు బాబాయ్.

తీరా ఆయన కన్నుమూసే ముందు నేనుగానీ, వాసూగానీ ఆయనవద్ద లేము. చనిపోయేముందు "వాసూ, వాసూ" అని కలవరించాడట ఆయన. వాసూవాళ్ళ నాన్నగారు త్రాగించిన గుక్కెడు తులసి తీర్థం త్రాగి వాసూ కోసం ఎదురుచూస్తూ ఇహలోక యాత్ర ముగించుకుని వెళ్ళిపోయాడు ఆయన.

* * *

రావల్సిన బంధువులందరూ వచ్చేశారు. ఇంట్లో అడుగు పెట్టడానికి అడుగు స్థలం లేకుండా మనుషులు నిండిపోయారు. ఏడుపులతో దుఃఖాలతో బాబాయ్ అంతిమయాత్ర ప్రారంభ మైంది. అంతటి శోక సముద్రంలోనూ కన్నీరు కార్చని వ్యక్తులు ఇద్దరే ఇద్దరు. ఒకరు నేను, రెండవ వ్యక్తి వాసూ!

బాబాయ్ భౌతికకాయాన్ని పంచ భూతా లలో కలిపేసి తిరిగి వచ్చేటప్పుడు వాడ్ని అడిగాను "వాసూ! నీకు ఏడుపు రాలేదురా ?"

వాడు చిన్నగా నవ్వాడు. "ఏడుపు రాలేదు బాబాయ్! హృదయంలో కొద్దిగా దుఃఖంగా